# ప్రజల తీర్పును గౌరవిస్తా

- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం
- పదేండ్లలో రూ.5250 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాత పనులకు కొబ్బరికాయ కొట్టవద్దు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, తాజా మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఓటమితో బీఆర్ఎస్ నాయకులు శోకసముద్రంలో మునిగిపోయారని, వారిని సముదాయించి ధైర్యం చెప్పినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు అందజేస్తామన్నారు. పార్టీ శ్రేణులు, పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. తాను 36 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నానని, గ్రామ సర్పంచ్‌గా, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసినట్లు పేర్కొన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.5250 కోట్లతో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కష్టసుఖాల్లో తనకు అండగా ఉన్న పార్టీ కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని కోరారు. పాత పనులను ఎమ్మెల్యే ప్రారంభించవద్దు, ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించవద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సూచించారు. ఎన్నికల ప్రచారంలో తాను ఎమ్మెల్యేగా ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని చెప్పిన పాయల్ శంకర్ తన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ప్రభుత్వం నుంచి కొత్త పనులను మంజూరు చేయించుకొని కొబ్బరికాయ కొట్టాలని సూచించారు. ఆదిలాబాద్‌లో విద్య, ఉపాధి కోసం వ్యవసాయ, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా, ఉపాధి రంగాల్లో ఎంతో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా 70 శాతం ఉంటే కేంద్ర ప్రభుత్వం వాటా 30 శాతం అన్నారు. తను నియోజకవర్గ ప్రజలకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండి సమస్యలపై పోరాటం చేస్తామని, కీలకమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, అజయ్, రాజు, విజ్జిగిరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# దట్టంగా కమ్మేసిన పొగమంచు


బజార్‌హత్నూర్‌లో రోడ్లపై కమ్మేసిన పొగమంచు

బజార్‌హత్నూర్/ఇచ్చోడ, డిసెంబర్ 6 : మిగ్‌జాం తుఫాను ప్రభావంతో ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాల్లో బుధవారం వేకువజాము నుంచి దట్టమైన పొగమంచు కమ్మేసింది. రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించనంతగా చిరుజల్లుల పొగమంచు కమ్మేసింది. చలి గాలులు వీస్తుండడంతో ప్రజలు రోడ్లపై మంటలు పెట్టుకొని సేద తీరారు. మరోపక్క రైతులు పొగమంచును లెక్క చేయకుండానే వ్యవసాయ పనుల్లో బిజీగా కనిపించారు.


ఇచ్చోడలో కమ్ముకున్న పొగమంచు

# ఎవరూ అధైర్య పడొద్దు


మాట్లాడుతున్న మంచిర్యాల తాజా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్షెట్టిపేట, డిసెంబర్ 6: నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడకూడదని మంచిర్యాల తాజా మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ నివాసంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటమి సహజమని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ప్రజా తీర్పును ఎవ్వరూ ఆపలేరని ప్రజల మన్ననలు పొందాలంటే వాళ్ల కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలన్నారు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో మంచివారిని ఎన్నుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ఇంతకు రెట్టింపు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో పార్టీ వెన్నంటే ఉండి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, మెట్టు కళ్యాణిరాజు, షబాన సజ్జు, సురేశ్ నాయక్, శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు నూనె ప్రవీణ్, నాయకులు తిరుపతి, చాంద్, నడిమెట్ల రాజన్న, కాసు సురేశ్, షాబు, రాజు, రవీందర్, అన్వర్, సతీశ్ రెడ్డి, కాంతయ్య, సుధాకర్, శంకర్‌రావు పాల్గొన్నారు.

# అడవిలో ఫారెస్ట్ సెక్షన్ శిక్షణ అధికారులు

- అవగాహన కల్పిస్తున్న అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్
- బెజ్జూర్ అటవీ ప్రాంతంలో 34 మంది పర్యటన


బెజ్జూర్ రేంజ్ ఇందర్‌గాం బీట్‌లోని బేస్ క్యాంప్ వద్ద సెక్షన్ అధికారులతో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్

బెజ్జూర్, డిసెంబర్ 6 : తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారుల బృందం బుధవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ అటవీ ప్రాంతానికి చేరుకుంది. ఇందులో ఏడుగురు మహిళా అధికారులతోపాటు 27 మంది పురుషులు మొత్తం 34 మంది ఉన్నారు. హైదరాబాద్‌లోని ధూలపల్లి ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ గతంలో బెజ్జూర్ రేంజ్‌లో 15 ఏళ్ల పాటు ఎఫ్ఆర్వోగా విధులు నిర్వహించారు. ఈయన శిక్షణ సెక్షన్ ఆఫీసర్లను బెజ్జూర్ రేంజ్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. ధూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో మూడు నెలల శిక్షణలో భాగంగా బెజ్జూర్ అటవీ ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు. ఇందర్‌గాం బీట్‌లో రాముడు-భీముడు అనే ప్రత్యేక వృక్షాలను చూపించి వాటి గురించి వివరించారు. బేస్ క్యాంప్‌ల ద్వారా వన్యప్రాణులపై ఎలా నిఘా వేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. పక్షి జాతులతోపాటు వన్యప్రాణులకు బెజ్జూర్ అటవీ ప్రాంతంలోని మత్తడి వద్ద సహజ సిద్ధంగా నీరు ఉబికి వస్తూ అట్టి నీరు వన్యప్రాణులకు జీవనాధారంగా ఉంటుందని తెలిపారు. శాఖాహార వన్యప్రాణుల గురించి 5 హెక్టార్లలో గ్రాస్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. పాలరాపు గుట్టపై గల రాబందుల స్థావరాల వద్దకు తీసుకెళ్లారు. పులి పాద ముద్రలను బట్టి అవి ఏ పులికి సంబంధించనదో వివరించారు. అటవీ ప్రాంతంలో ఎండు కట్టెల వల్ల చెదలు పట్టడంతో చెదలు ఏర్పాటు చేసిన చీమలు/పురుగుల పక్షులకు ఎలా ఆహారంగా మారుతుందో వివరించారు. సాయంత్రం జన్నారం అటవీ ప్రాంతానికి వెళ్లారు. వీరి వెంట రేంజ్ అధికారి దయాకర్, ఎఫ్‌బీవోలు శ్రీధర్, అనిత, అనిల్ ట్రాకర్స్ సిబ్బంది ఉన్నారు.

# గూడెంలో కార్తీక సందడి

దండేపల్లి, డిసెంబర్ 6 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో కార్తీక సందడి కొనసాగుతుంది. బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ముందుగా పవిత్ర గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం గుట్ట కింద భాగంలో రావిచెట్టు కింద, గుట్టపైన గల ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. వతాల కోసం ప్రత్యేకంగా రెండు మండపాలను ఏర్పాటు చేశారు.


సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

# హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్, డిసెంబర్ 6 : ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో జిల్లా పాఠశాలల క్రీడ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలికల విభాగంలో హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 100 మంది పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉందని, ప్రతి ఒక్కరూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిలో ప్రబబుల్స్‌కి 22 మందిని ఎంపిక చేసి కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి సాంబశివరావు, హ్యాండ్ బాల్ శిక్షకుడు అరవింద్, అథ్లెటిక్స్ శిక్షకుడు విద్యాసాగర్, ఫుట్‌బాల్ కోచ్ రవి, ఆయా జిల్లాల శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు రాకేశ్, మల్లిక, లక్ష్మి, రవి, రజిత పాల్గొన్నారు.